www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 24 ఆగస్టు 2025
5
వైఎస్ఆర్



31న చేతి వృత్తిదారుల సదస్సు

ప్రజాశక్తి-బద్వేలు

స్థానిక సుందరయ్య భవన్‌లో ఈ నెల 31న చేతి వృత్తిదారుల సదస్సును జయప్రదం చేయాలని చేతి వృత్తిదారుల సంఘం పట్టణ గౌరవాధ్యక్షులు శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం చేతి వృత్తిదారుల సదస్సు కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేతి వృత్తిదారుల పట్ల ప్రభుత్వం చిన్న చూపు చూస్తోందన్నారు. వృత్తిదారులకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇస్తానని చెప్పిన మాట నెరవేర్చలేదని, ఆదరణ పథకం ద్వారా ఆధునాతనమైన పనిముట్లు అని చెప్పిన మాట ఏమైందని ప్రశ్నించారు. కార్యక్రమంలో చేతి, రజక, క్షౌర, మేదర వృత్తిదారుల సంఘాల నాయకులు జి.నాగార్జున, సుబ్బరాయుడు, సిద్ధవటం సుబ్బరాయుడు, రామయ్య, రెడ్డయ్య, ప్రసాద్, వెంకటేశ్వర్లు, రాజగోపాల్, రాయప్ప, పాల్గొన్నారు.

యూరియా..ఏదయా!

- జిల్లాలో సరిపడా నిల్వలు లేకపోయినా ఉన్నట్లు నటన
- ప్రొద్దుటూరు నుంచి నంద్యాలకు యూరియా తరలింపు!?
- రైతుల నెత్తిన నానో యూరియా బండ
- పలు చోట్ల యూరియా బస్తా రూ.370
- మైదుకూరులో దుకాణాల మూత



మైదుకూరులో ట్రాక్టర్‌లో యూరియా తీసుకువెలుతున్న రైతులు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో యూరియా నిల్వలపై సర్కారు నాటకం ఆడుతోంది. జిల్లాలో అవసరాలకు సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయని చెబుతున్న అధికారుల మాటలకు క్షేత్రస్థాయి పరిస్థితికి మధ్య వ్యత్యాసం కనిపిస్తోంది. కడప జిల్లాలో కెసి కెనాల్, తెలుగుగంగ ఆయకట్టు కింద 1.20 లక్షల ఎకరాల్లో వరి పంట ముమ్మరంగా సాగుతోంది. వరి సాగుకు యూరియా వినియోగం తప్పనిసరి. జిల్లాలో యూరియా దొరకని పరిస్థితి నెలకొంది. జిల్లాలోని ఆర్‌ఎస్‌కెలు, వ్యవసాయ సహకార కేంద్రాల దుకాణాల దగ్గర రైతులు నిరీక్షిస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. కేంద్ర ప్రభుత్వం ఎరువుల వినియోగాన్ని తగ్గించాలనే ఉద్దేశంతో నానో యూరియాను అంటగట్టాలనే ఒత్తిడితో యూరియా కొరతను సృష్టిస్తోందనే వాదన వినిపిస్తోంది.

ప్రస్తుత ఖరీఫ్‌లో 3,32,160 ఎకరాల్లో పంటలు సాగు చేయాలని ఉభయ జిల్లాల వ్యవసాయశాఖలు ప్రణాళికలు రూపొందించుకున్నాయి. కడప జిల్లాలో 1,91,363 ఎకరాల సాగు చేయడంపై దృష్టి సారించాయి. 2025-26 ఖరీఫ్ సీజన్‌లో ప్రధానంగా వరి, పత్తి, వేరుశనగ పంటలను పెద్దఎత్తున సాగు చేయడం తెలిసిందే. కడప జిల్లాకు 63,653 మెట్రిక్ టన్నులు ఎరువులు అవసరమని అధికార యంత్రాంగం ప్రతిపాదించింది. జిల్లాలోని కెసి, తెలుగుగంగ ఆయకట్టు ప్రాంతాల్లో పెద్దఎత్తున వరి పంట సాగు చేసిన నేపథ్యంలో భాగంగా 20,538 టన్నుల యూరియా అవసరమని అంచనా వేసింది. 16,875 మెట్రిక్ టన్నులు కేటాయించింది. జిల్లా అవసరాల నిమిత్తం ఆగస్టులో 4,850 మెట్రిక్ టన్నులు కేటాయించినట్లు చెబుతోంది. క్షేత్రస్థాయి సాగు విస్తీర్ణానికి అనుగుణంగా యూరియా అందని పరిస్థితి నెలకొంది. ఫలితంగా జిల్లాలోని 432 ఆర్‌ఎస్‌కెలు, 24 సహకార సంఘాల ఎదుట రైతులు నిరీక్షించాల్సిన దుస్థితి దాపురించింది. యూరియా కొరత ఏర్పడిన నేపథ్యంలో రైతులు ప్రయివేటు డీలర్ల వైపునకు పరుగులు తీయడం ప్రారంభించారు. ఇదేఅదునుగా భావించిన ప్రయివేటు డీలర్లు బస్తా యూరియాను రూ.270 నుంచి రూ.370 నుంచి రూ.450 వరకు విక్రయించడం ద్వారా రైతులను నిలువు దోపిడీ చేసిన వైనం చర్చనీయాంశంగా మారింది.

మూసివేతలో దుకాణాలు!

జిల్లాలో ఎరువుల కొరత నేపథ్యంలో జిల్లా వ్యవసాయశాఖ కలెక్టర్ ఆధ్వర్యంలో దుకాణదారులతో సమావేశం నిర్వహించింది. ఎరువులను కృత్రిమ కొరత సృష్టించినా, ఎంఆర్‌పి రేట్లకు మించి విక్రయిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. విజిలెన్స్ దాడుల్లో పట్టుబడిన దుకాణాలను సీజ్ చేస్తామని హెచ్చరించింది. ఫలితంగా జిల్లాలోని మైదుకూరు, చాపాడు, దువ్వూరు సహా పలు మండలాల్లో యూరియా దొరకని పరిస్థితి నెలకొంది. మైదుకూరులో దుకాణాలు మూతవేసిన వైనం అందరిదృష్టినీ ఆకర్షిస్తోంది. మూసి వేతకు గల కారణాలను ఆరా తీస్తే రాష్ట్రంలోని ప్రయివేటు ఎరువుల కంపెనీల నుంచి అధిక ధరలు చెల్లించి తెప్పించుకున్న యూరియా నిల్వలను ఎంఆర్‌పి రేట్లకు విక్రయించడం ద్వారా నష్టాలు చవిచూడాల్సి వస్తుందనే ఉద్దేశంతో దుకాణాలను మూసివేసినట్లు తెలుస్తోంది.

పొరుగు జిల్లాకు...

జిల్లా రైతాంగానికి యూరియా అందని నేపథ్యం ఆందోళన కలిగిస్తోంది. ఇదిలాఉండగా పొరుగు జిల్లా సరిహద్దు పట్టణాలైన ప్రొద్దుటూరు, జమ్మలమడుగు నుంచి నంద్యాల జిల్లాకు పెద్దఎత్తున తరలిపోతోంది. యూరియా బస్తా రూ.800 చొప్పున కొనుగోలు చేసి ఆటోల ద్వారా తరలిస్తుండడం విస్మయాన్ని కలిగిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం క్షేత్రస్థాయి పరిస్థితిని సమీక్షించాల్సిన అవసరం ఉరుము తోంది.

యూరియాను అందుబాటులో ఉంచాలి

ఐదు ఎకరాల్లో వరి పంటను సాగు చేశా. రైతు సేవా కేంద్రాల్లో యూరియా కోసం వెళ్లినప్పుడు అందుబాటులో ఉండడం లేదు. మైదుకూరులో ప్రయివేట్ దుకాణాల్లో అన్ని రకాల ఎరువులు కొనుగోలు చేస్తేనే యూరియాను ఇస్తున్నారు. అధికారులు స్పందించి యూరియాను రైతులకు అందుబాటులో ఉంచాలి. ప్రయివేట్ దుకాణాల్లో రైతుల కోరిన వెంటనే యూరియాను అందించేలా ఆదేశాలు జారీ చేయాలి.

- నారాయణ, రైతు, బయనపల్లె, దువ్వూరు.

యూరియా కృత్రిక కొరత సృష్టిస్తున్నారు

ప్రయివేట్ దుకాణాల్లో యూరియా నిలువ లేదని సూచిస్తున్నారు. అన్ని రకాల ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు మాత్రం యూరియాను అందిస్తూ కేవలం యూరియా కోసమే దుకాణాలకు వెళితే లేదని వెనుకకు పంపుతున్నారు. రైతు సేవా కేంద్రంలో యూరియా అందుబాటులో లేదు. రైతు సేవా కేంద్రాల్లో కంటే రూ.80 అధికంగా వసూలు చేస్తున్నారు. ఏడు ఎకరాలలో దేవస్థాన భూమిని కౌలుకు చేసుకుంటున్నా. ఎరువులు పొందడం కష్టంగా ఉంది.

- జయరామిరెడ్డి, రైతు, చియ్యపాడు, చాపాడు.

యూరియా కొరతను అధిగమించాలి

జిల్లాలో యూరియా కొరత రానీయకుండా చూడాలి. ఇటీవల తన వరి సాగులో భాగంగా రూ.450 చెల్లించి కొనుగోలు చేయాల్సి వచ్చింది. ప్రభుత్వం యూరియా నిల్వలను పెంచాలి.

- ఎ.రమణ, రైతు, నరసన్నపల్లి, బ్రహ్మంగారిమఠం.

ఎరువుల కొరత ఉండదు

ఖరీఫ్ అవసరాల మేరకు ఎరువులను అందుబాటులో ఉంచాం. జిల్లా వ్యాప్తంగా ఆయా మండల యంత్రాంగం ఇచ్చిన ఇండెంట్ల ఆధారంగా ఎరువుల కేటాయింపులు చేస్తున్నాం. ఎవరైనా ఎంఆర్‌పి రేట్లకు మించి విక్రయించినా, కృత్రిమ కొరత సృష్టించినా కఠిన చర్యలు తీసుకుంటాం.

- బి.చంద్రానాయక్, జిల్లా వ్యవసాయాధికారి, కడప.

ఒపిఎస్ అమలు చేయాలి : యుటిఎఫ్



మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా

ప్రజాశక్తి-కడప అర్బన్

2003 డిఎస్‌సి ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలంటూ విజయవాడలోని ధర్నా చౌక్ వద్ద ఈ నెల 25న చేపట్టే ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు పిలుపునిచ్చారు. శనివారం యుటిఎఫ్ భవన్‌లో ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం నూతన పెన్షన్ విధానాన్ని 2004 సెప్టెంబర్ ఒకటి నుంచి నియామకం పొందిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు వర్తింపజేస్తూ ఉత్తర్వులు ఇచ్చిందని తెలిపారు. 2003లో డిఎస్‌సి నోటిఫికేషన్ ఇచ్చి ఫలితాలను వెల్లడించినప్పటికి ప్రభుత్వమే నియామక ఉత్తర్వులు ఇవ్వడంలో ఆలస్యం చేసిందని పేర్కొన్నారు. అభ్యర్థుల వైపు నుంచి ఎటువంటి తప్పిదాలు లేకపోయినప్పటికీ 2003 డిఎస్‌సి ఉపాధ్యాయులు పాత పెన్షన్ పరిధిలో ఉండాల్సినప్పటికీ ప్రభుత్వ అలసత్వం వల్ల నూతన పెన్షన్ విధానంలోకి నెట్టి వేయబడ్డారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం మెమో నంబర్ 57 ద్వారా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం అమలు పరిచిందని పేర్కొన్నారు. ప్రభుత్వం మాత్రం మీన మేషాలు లెక్కిస్తూ 11 వేల మంది రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయుల పాత పెన్షన్ అమలులో తీవ్ర జాప్యం చేస్తున్నదని చెప్పారు. గత ప్రభుత్వం రాష్ట్రంలోని ముగ్గురు సివిల్ సర్వీసెస్ అధికారులకు మాత్రం పాత పెన్షన్ విధానాన్ని అమలు పరిచిందని, ఉద్యోగ, ఉపాధ్యాయులకు మాత్రం మొండిచేయి చూపిందన్నారు. సిఎం చొరవ తీసుకుని ఒపిఎస్ అమలుకు ఉత్తర్వులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శులు సి.వి.రమణ, ఏజాస్ అహ్మద్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కృష్ణారెడ్డి, నాయకులు సుబ్బారావు, గోపీనాథ్, ప్రకాష్ బాబు, వీరనారాయణ, కిరణ్ బాబు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు ఇవ్వాలి : సిఐటియు

ప్రజాశక్తి కడప అర్బన్ : డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డ్సుకు పెండింగ్‌లో ఉన్న ఐదు నెలల వేతనాలు ఇవ్వాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్, ఆప్కాస్ రాష్ట్ర కార్యదర్శి పి.వెంకటసుబ్బయ్య, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రవి, పవన్ ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. వేతనాలు రాక తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. శానిటేషన్ పరిస్థితి కూడా ఇలానే ఉన్న ఆశ్చర్యం లేదని తెలిపారు. సెక్యూరిటీ గార్డ్సుకు ఒక్క రోజు కూడా సెలవు ఇవ్వకపోవడం లేబర్ యాక్ట్‌కు భిన్నంగా చేయడమేనని పేర్కొన్నారు. 365 రోజులు విధులు నిర్వహించాల్సినటువంటి పరిస్థితి ఉన్నదని తెలిపారు. సెక్యూరిటీ గాడ్స్‌కు కొత్త అగ్రిమెంట్ ప్రకారం రూ.18,600 ఇవ్వాల్సి ఉండగా వీరికి కేవలం రూ.7 నుంచి రూ.8 వేలు ఇస్తున్నారని పేర్కొన్నారు. కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రంలో దోపిడీ ప్రభుత్వ పాలన : వైసిపి

ప్రజాశక్తి - కడప: రాష్ట్రంలో దోపిడీ కోతల ప్రభుత్వం పాలన సాగుతోందని మాజీ డిప్యూటీ సిఎం అంజాద్‌బాషా అన్నారు. శనివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిబంధనల పేరుతో అన్ని పథకాల్లో కోతలు ఈ ప్రభుత్వం విధిస్తోందని విమర్శించారు. అకారణంగా లక్షలాది మంది లబ్ధిదారుల ఫించన్లు తొలగించారన్నారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-కడప అర్బన్ : జిల్లాలో ప్రజలకు నాణ్యమైన ఆహారం అందించకుండా ప్రజల ప్రాణాలతో చాలగటమడుతున్న హోటల్స్, బేకరీలు, స్ట్రీట్ ఫుడ్ సెంటర్లను తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులపై చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ డిమాండ్ చేశారు. శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆహార భద్రతా నియమాలను జిల్లా లో హెూటల్స్, బేకరి యాజమాన్యాలు పాటించడం లేదన్నారు. నిబంధనలు పాటించకుండా నడుస్తున్న హోటల్స్, బేకరిల యాజమాన్యాలపై ఫుడ్ సేఫ్టీ అధికారులు రెగ్యులర్‌గా తనిఖీలు నిర్వహించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. కడప వంటి నగరాలలో రోజు ఏదో ఒక సంఘటన జరుగుతున్న అధికారులలో చలనం లేదన్నారు. కనీసం చర్యలు తీసుకుని, కేసులు నమోదు చేయడంలో ఎందుకు తాస్కారం చేస్తున్నారని ప్రశ్నించారు. నాణ్యత, పరిశుభ్రత వంటివి కూడా పాటించడం లేదని పేర్కొన్నారు. అధికారులు ఇప్పటికైనా హోటల్స్, బేకరిలు, స్ట్రీట్ ఫుడ్ సెంటర్స్ వంటివి వాటి పై తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. సమావేశంలో నగర కార్యదర్శి విజయ్ పాల్గొన్నారు.

డిగ్రీ ఇన్‌స్టెంట్ పరీక్ష ఫలితాలు విడుదల

ప్రజాశక్తి-కడప అర్బన్ : వైవీయూ అనుబంధ డిగ్రీ కళాశాలల ఇన్‌స్టెంట్ పరీక్షల ఫలితాలను వైవీయూ విసి ఆచార్య అల్లం శ్రీనివాసరావు విడుదల చేశారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ, పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య కృష్ణారావుతో కలసి విసి మాట్లాడుతూ బిఎ, బీకాం, బిఎస్‌సి, బిబిఎ, బ్యాచిలర్ ఆఫ్ వోకేషనల్ ఐదు సెమిస్టర్ల పరీక్షలు ఈ నెల 5వ తేదీ నుంచి ప్రారంభమై 14వ తేదీకి ముగిశాయని పేర్కొన్నారు. ఈ పరీక్షలకు 1,012 మంది విద్యార్థులు హాజరు కాగా 977 ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. పీజీ కోర్సులలో ప్రవేశాలకు అనువుగా ఫలితాలు వెంటనే విడుదల చేశామని చెప్పారు. యుద్ధప్రాతిపదికన సమాధాన పత్రాల మూల్యాంకనం పూర్తి చేసి ఫలితాలు విడుదల చేసిన పరీక్షల విభాగాన్ని విసి అభినందించారు. విద్యార్థులు ఫలితాల కోసం https:www.yvuexams.in/results.aspx అనే వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. కార్యక్రమంలో సహాయ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ గణేష్ నాయక్ పాల్గొన్నారు.

ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కడప సిటీ



ఆపరేషన్ థియేటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవి

ప్రభుత్వ సర్వజన, కడప సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో నిర్మించిన మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్ కాంప్లెక్స్‌ను కడప ఎమ్మెల్యే మాధవి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆధునిక సదుపాయాలతో కూడిన ఈ మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్ కాంప్లెక్స్ ప్రారంభం వల్ల ప్రజలకు మరింత నాణ్యమైన వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో రిమ్స్ అడిషనల్ డిఎంఇ డాక్టర్ కెఎస్ఎస్ వెంకటేశ్వరరావు, ప్రిన్సిపల్ డాక్టర్ టి.జమున, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి సూపరిండెండెంట్ డాక్టర్ సి.సునీల్ కుమార్‌రెడ్డి, సిఎస్ ఆర్ఎంఒ వై.శ్రీనివాసులు, జిజిహెచ్ డిప్యూటీ కలెక్టర్ యు.రంగస్వామి, డాక్టర్ వెంకటరాముడు, డాక్టర్ పెంచలయ్య, డాక్టర్ నరోత్తమరెడ్డి, డాక్టర్ విజయ భాస్కర్‌రెడ్డి, శానిటేషన్ మరియు సెక్యూరిటీ కాంట్రాక్టర్ జె.బాలనారాయణరెడ్డి, హెచ్‌ఒడిలు, డాక్టర్లు, అధికారులు, సిబ్బంది, పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

దారుణం

ప్రజాదృష్టి

ఉమ్మడి కడప జిల్లాలో వేర్వేరు ఘటనల్లో నలుగురు విద్యార్థులు మృతి చెందడం కలిచివేసింది. రాజంపేట అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో ఎంబిఎ చదువుతున్న ముగ్గురు విద్యార్థులు, వేంపల్లి ట్రిపుల్‌ఐటికి చెందిన ఓ విద్యార్థి ఆత్మహత్య పాల్పడిన ఉదంతాలు చర్చనీయాంశంగా మారాయి. అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు సరదా కోసం చెయ్యేరులోకి ఈతకు వెళ్లగా ముగ్గురు జలసమాధి కావడం తల్లిదండ్రులను కన్నీటిపర్యంతం చేసింది. ట్రిపుల్‌ఐటి విద్యార్థి ఆత్మహత్యకు కారణమేమిటో తెలియని పరిస్థితి నెలకొంది. ఏదేమైనా నలుగురు విద్యార్థులు రెండు వేర్వేరు ఘటనల్లో ఉన్న ఫళంగా మృత్యువాత పడడం సమాజాన్ని ఉలిక్కిపడేలా చేసింది. తల్లిదండ్రులు ఎన్నో ఆశలు పెటుకుని ఉన్నత చదువులు చదివించుకుంటున్నారు. చేతికి అందేలోపు మృత్యువు కబళించడం భరించలేని దు:ఖాన్ని కలిగిస్తోంది. ప్రతిఏటా జిల్లాలో ఏదోఒక చోట సరదా కోసం ఈతకు వెళ్లి పలువురు మృత్యువాత పడడం పరిపాటిగా మారింది. అన్నమయ్య జిల్లాలోని చెయ్యేరు, వల్లూరు మండల పరిధిలోని పుష్పగిరిక్షేత్రం దిగువ గల పరీవాహక ప్రాంతంలో, దువ్వూరు, బిమఠం పరిధిలోని తెలుగుగంగ కాల్వల సమీపంలోని పరీవాహక ప్రాంతాల్లోకి దిగిన యువకులు సుడిగుండాల బారిన పడి మృతి చెందుతున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. చెయ్యేరు పరీవాహక ప్రాంతంలో బావుల తరహాలో ఇసుక గుంతలు తవ్వడం, పుష్పగిరి పుణ్యక్షేత్రం సమీపంలోని పరీవాహక ప్రాంతంలో ఏర్పడిన గుంతల్లో సుడిగుండాలు, తెలుగుగంగ కాల్వల ప్రవాహంలో పడి పలువురు మృత్యువాత పడుతున్న సంగతి తెలిసిందే. మరణాల నివారణకు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయడం, ప్రమాదకర ప్రాంతాల్లోకి దిగకుండా భద్రతా ఏర్పాట్లు చేయడం ద్వారా మరణాలను నివారించే ప్రయత్నం చేయచ్చనే వాదన వినిపిస్తోంది. గురువారం ముఖ్యమంత్రి అధ్యక్షతన నిర్వహించిన కేబినెట్ సమావేశంలో అంగన్వాడీలకు గ్రాట్యుటీ చెల్లింపు నిర్ణయం తీసుకోవడం స్వల్పఊరటను కలిగించింది. టిడిపి అధ్యక్షుని హోదాలో 2024 సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో అంగన్వాడీలకు ఇచ్చిన హామీని నెరవేర్చుతూ నిర్ణయం తీసుకోవడం హర్షనీయం. 62 ఏళ్లు నిండిన అనంతరం అంగన్వాడీలకు రూ.లక్ష, హెల్పర్లకు రూ.40 వేలు గ్రాట్యుటీ ఇస్తామని, మిగిలిన వారిని గాలికి వదిలేస్తూ షరతులు పెట్టడం నిరాశను కలిగించింది. ఇంతటి సుదీర్ఘకాలం ఎవరు పని చేసే వాళ్లు అతి స్వల్ప సంఖ్యలో ఉంటారని అంగన్వాడీ యూనియన్ల నుంచి వినిపిస్తోంది. ప్రభుత్వాలు మారినప్పుడల్లా అంగన్వాడీలకు తొలగింపు బెదిరింపుల నేపథ్యం కొనసాగుతున్న నేపథ్యంలో గ్రాట్యుటీ చెల్లింపు నిర్ణయం పట్ల ఆశించిన స్పందన కనిపించని పరిస్థితి కనిపిస్తోంది. ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో ఉభయ జిల్లాకు చెందిన సుమారు తొమ్మిది నుంచి 12 వేల మంది అంగన్వాడీలకు గ్రాట్యుటీ సదుపాయాన్ని వర్తింపజేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి-చింతాకొమ్మదిన్నె

మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఐసిడిఎస్ సూపర్వైజర్స్ శ్రీదేవి, లక్ష్మీదేవి అన్నారు. శనివారం మండలంలోని కొలుమలపల్లి జడ్పీ హెచ్ఎస్ హైస్కూల్‌లో చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ 1098 గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పిల్లలకు ఏదైనా సమస్యలు ఎదురైనప్పుడు 1098కి ఫోన్ చేయాలని తెలిపారు. బాల్యవివాహాలు చేస్తే వెంటనే 1098కి ఫోన్ చేసి తెలియజేయాలన్నారు. యపరచ వచ్చునని. కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయులు రమాదేవి, సోషల్ వర్కర్ లక్ష్మి ప్రసన్న, అంగన్వాడి కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జగన్‌పై టిటిడి చైర్మన్ వ్యాఖ్యలు సరికాదు

ప్రజాశక్తి - కడప

జగన్, భారతిపై టిటిడి చైర్మన్ వ్యాఖ్యలు దారుణమని వైసిపి వైద్య విభాగం జిల్లా అధ్యక్షులు డాక్టర్ నాగార్జునరెడ్డి విమర్శించారు. శనివారం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్‌ను విమర్శించడం టిటిడి చైర్మన్‌కు మంచి పద్ధతి కాదన్నారు. మహిళ అని కూడా చూడకుండా అసభ్యకరమైన విమర్శలు చేయడం దారుణమన్నారు. మాజీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులికుమార్ మాట్లాడుతూ టిటిడి చైర్మన్‌గా గౌరవప్రదమైన స్థానంలో ఉంటూ రాజకీయ విమర్శలు చేయడం తగదన్నారు. సమావేశంలో షఫీ పాల్గొన్నారు.

భూ కబ్జాదారులకు అండగా రెవెన్యూ అధికారులు

ప్రజాశక్తి-అట్లూరు

భూకబ్జాదారులకు రెవెన్యూ అధికారులు అండగా నిలుస్తున్నారని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పిం.చాంద్‌బాషా, మండల కార్యదర్శి రమణమ్మ అన్నారు. శనివారం మండలంలోని ఎస్.వెంకటాపురంలోని సర్వే నంబర్ 60, 61లో ఉన్న భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయా సర్వే నెంబర్లలో 20 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉందన్నారు. ఆ భూమిని ప్రజలు 25 సంవత్సరాలుగా గ్రామ అవసరాల కోసం అలాగే ఉంచారని తెలిపారు. మూడు రోజుల క్రితం కొంతమంది భూ కబ్జాదారులు ఆ భూమిలో జెసిబిలు పెట్టి భూమిని చదును చేశారన్నారు. నిజమైన లబ్ధిదారులు రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా న్యాయం జరగడం లేదన్నారు. కబ్జాదారులకు మాత్రం అండగా నిలుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. భూ కబ్జాలను అరికట్టకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఆదిలక్ష్మమ్మ, వెంకటసుబ్బమ్మ, అచ్చమ్మ, ఎస్.వెంకటాపురం ప్రజలు శివ, లక్ష్మీ నరసయ్య, శ్రీను, సంధ్యా, గంగాదేవి పాల్గొన్నారు.

సామాజిక సేవ చేయడం అభినందనీయం

ప్రజాశక్తి - బద్వేలు

డివైఎఫ్ఐ నాయకత్వం సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎం.విజయ్‌కుమార్, సీమాంక్ ఆస్పత్రి సూపరింటెండెంట్ సుబ్బారెడ్డి, శ్రీచక్ర ఆస్పత్రి డాక్టర్ చక్రధర్‌రెడ్డి అన్నారు. శనివారం బి.ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పచ్చదనం లోపించి పట్టణాలు విస్తరిస్తూ చెట్లను నరికి వేయడంతో వాతావరణంలో వస్తున్న మార్పుల వల్ల జీవన విధానం ఇబ్బందికరంగా మారిందన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపల్ ఎం.లతాదేవి, అధ్యాపకులు శారద, ఖిరున్నీసా, షకీరా, భారతి, లక్ష్మీదేవి, లలిత, చెన్నమ్మ, బ్రహ్మయ్య, సిఐటియు పట్టణ కన్వీనర్ కె.నాగేంద్రబాబు, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని, పట్టణ అధ్యక్షులు షేక్ మస్తాన్ షరీఫ్, ముడమాల ఓబుల్‌రెడ్డి, నాయకులు యువరాజు, రాజు, ఎస్.కె ఖలీల్, సుధాకర్, పాతిమా పాఠశాల విద్యార్థినిలు పాల్గొన్నారు.

ప్రారంభమైన వరి సాగు

భారీగా పెరిగిన సాగు ఖర్చులు - కెసి కెనాల్ కింద వరి నాట్లకు బెంగాల్ నుంచి వలస కూలీలు

ప్రజాశక్తి - చాపాడు

ఖరీఫ్ సీజన్‌లో నియోజకవర్గ వ్యాప్తంగా వరిపంట విస్తారంగా సాగవుతోంది. నియోజకవర్గ పరిధిలోని మైదుకూరు, చాపాడు దువ్వూరు, ఖాజీపేట, బ్రహ్మంగారిమఠం మండలాల్లో అధికంగా రైతులు వరి సాగు చేపడుతున్నారు. కెసి కాలువకు జులై రెండవ వారంలోనే నీరు విడుదల కావడంతో సాగు గతంలో కంటే కాస్త ముందజలో ఉంది. ఇప్పటికే నియోజకవర్గ వ్యాప్తంగా 25 వేల ఎకరాల వరకు వరి పంట సాగు పూర్తయింది. చాపాడు మండల పరిధిలో ఏడు వేల ఎకరాల వరకు పూర్తయింది. పంట సాగుకు రైతులు చర్యలు చేపట్టడంతో పది రోజుల్లో మరో 20 వేల ఎకరాల్లో సాగయ్యే అవకాశం ఉంది. చాపాడు మండలంలో కుందూ నది, కెసి కాలువ పరిధిలో 14 వేల ఎకరాల్లో వరి సాగును రైతులు చేపట్టేందుకు రైతులు ఏర్పాట్లు చేపడుతున్నారు. మైదుకూరు, ఖాజీపేట, దువ్వూరు మండలాల పరిధిలో తెలుగుగంగ రిజర్వాయర్ కింద 20 వేల ఎకరాల్లో వరి సాగు చేపట్టారు. గత రెండేళ్లతో పోలిస్తే వరి పంట సాగు తగ్గుముఖం పట్టింది. వరి స్థానంలో ఆరుతడి పంటల సాగుకు రైతులు ఆసక్తి కనపరుస్తున్నారు. కూలీలు, దుక్కుల ఖర్చులు పెరగడంతో వరి సాగు ఖర్చులు పెరిగాయని రైతులు పేర్కొంటున్నారు. వరి ధాన్యం ధరలు మాత్రం నామమాత్రంగా ఉండటంతో రైతులు ఆరుతడి పంటల వైపు ఆసక్తి కనపరుస్తున్నారు. కెసి కెనాల్ పరిధిలో ఇతర పంటలకు అవకాశం లేకపోవడంతో తప్పదన్నట్లు వరి పంటను సాగు చేపడుతున్నారు.



వరి సాగుకు ఏర్పాట్లు చేసుకుంటున్న రైతులు


పెరిగిన సాగు ఖర్చులు..

ఎకరాకు విత్తన వడ్లకు రూ.2 వేలు, ట్రిల్లర్, గేజీలు కొట్టినందుకు ఎకరాకు రూ.1600ల ప్రకారం 3 దఫాలు చేపట్టాల్సి వస్తుంది. నాటేందుకు రూ.4500, నారు మోసేందుకు రూ.800, కాడి ఎద్దులకు రూ.1500, ఎరువులతో కలిపి రూ.15 వేల వరకు ఎకరాకు సాగు ఖర్చులు అవుతున్నాయి. పంట పూర్తయ్యే సరికి ఎకరాకు రూ.30 వేలు అవుతుంది. ఎరువులు అన్నీ కూడా ఏడాది పెరిగాయని రైతులు వాపోతున్నారు యూరియా బస్తా రూ.270 అయితే మార్కెట్లో రూ.350 కూడా లభ్యం కావడం లేదు. వరి ధాన్యం ధరలు నామామాత్రంగా ఉండటంతో ఏమాత్రం ఆదాయం రావడంలేదని రైతులు పేర్కొంటున్నారు. వరి ధాన్యం గత జనవరి నుంచి ఏమాత్రం పెరగకపోవడంతో వరి ధాన్యానికి డిమాండ్ తక్కువగా ఉంది.

బెంగాలీ వలస కూలీలతో వరి నాట్లు..

కూలీలకు డిమాండ్ పెరగడంతో బెంగాల్ ప్రాంతం నుండి వచ్చిన కూలీలు వరినాట్లు వేస్తున్నారు. సుమారుగా 500 మందికి పైగా బెంగాలీ కూలీలు వలస వచ్చి వరినాట్లు వేస్తున్నారు. రూ.4వేలు ఎకరాకు కూలీలకు తీసుకుంటూ వరినాట్లు వేస్తున్నారు. సెప్టెంబర్ రెండవ వారం వరకూ వరి నాట్లు దాదాపుగా పూర్తి కావచ్చు.సాగు ఖర్చులు పెరగడంతో కౌలు రైతులు భూములు చేసుకునేందుకు ముందుకు రావడంలేదు. కౌలు రేట్లు తగ్గడం ఎకరాకు 12 బస్తాలు చెల్లిస్తున్న కౌలు ఈ ఏడాది 8 బస్తాల వరకు చెల్లించేలా ఒప్పందాలు చేసుకున్నారు. కొంతమంది రైతులు భూములు ఇవ్వకుండా స్వతహాగా సాగు చేపడుతున్నారు. మొత్తానికి ఈ ఏడాది వరి పంట సాగు ఖర్చులు పెరిగాయని రైతులు పేర్కొంటున్నారు.

వరి సాగుకు అధికమవుతున్న ఖర్చులు



ఎకరా వరి పంట సాగుకు ప్రారంభంలో రూ.15 వేల వరకు ఖర్చులు అవుతున్నాయి. వరి పంట పూర్తిగా నూర్పిడి చేసేనాటికి రూ.30 వేల వరకు ఖర్చులు అవుతున్నాయి. ఎకరాకు 32 బస్తాలు అయినప్పటికీ ప్రస్తుతం ఉన్న ధరలతో ఏమాత్రం ఆదాయం రావడం లేదు. ప్రభుత్వం వరి ధాన్యానికి గిట్టుబాటు ధరను కల్పిస్తే ఉపయోగకరంగా ఉంటుంది.

- వీరారెడ్డి, వరి సాగు, రైతు చాపాడు.

ప్రత్యామ్నాయం లేక వరి సాగు



కెసి కెనాల్ కాలువ పరిధిలో ఇతర ఆరుతడి పంటలు సాగు చేసే అవకాశం లేదు. నీరు అధికంగా ప్రవహిస్తుండడంతో ఆరుతడి పంటలు సాగు చేస్తే దిగుబడులు రావు. నష్టాలు వస్తున్నప్పటికీ వరి పంట సాగు తప్పడం లేదు. ప్రస్తుతం నాలుగు ఎకరాలలో వరి పంట సాగు చేశాను. ఎకరా సాగుకు రూ.25 వేలకు పైగా అవుతున్నది. ప్రభుత్వం ఎరువులు నూర్పిడి యంత్రాలను సబ్సిడీ ద్వారా సమకూరుస్తే ఉపయోగకరంగా ఉంటుంది. ధాన్యం ధరలు కూడా అంతంతో మాత్రమే ఉంటున్నాయి గిట్టుబాటు ధర కల్పించాలి.

- సుబ్బరాయుడు రైతు సిద్ధారెడ్డిపల్లి.



వరి నాట్లు వేస్తున్న బెంగాలీ కూలీలు

నూతన యాజమాన్య పద్ధతులు పాటించాలి



మండల పరిధిలో కెసి కెనాల్, కుందూ, పెన్నా పరిధిలో రైతులు వరి సాగును అధికంగా చేపడుతున్నారు. వరి సాగులో నూతన యాజమాన్య పద్ధతులు పాటించడం వలన అధిక దిగుబడులు పొందవచ్చు. ఇప్పటికే పొలం పిలుస్తోంది ద్వారా రైతులందరికీ సాగుపై అవగాహన కల్పిస్తున్నాం. కాలిబాటలు తీయడం, యూరియాను అవసరం మేరకు మాత్రమే ఉపయోగించడం, ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించాలని రైతులకు వివరిస్తున్నాం. సాగు ఖర్చులు తగ్గించుకోవడం ద్వారా ఆదాయం పొందవచ్చు. రైతులకు కావాల్సిన ఎరువులను అందుబాటులో ఉంచుతున్నాం.

- దేవీ పద్మలత, వ్యవసాయ అధికారి, చాపాడు.

యువతకు స్ఫూర్తి.. విగ్రహ తయారీలో మేటి



ముస్తాబైన వినాయక విగ్రహాలు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

చదువుకుని.. ఉద్యోగాలు చేయడమే కాదు వినాయడి విగ్రహాల తయారీలో భాగస్వాములై నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు.. జమ్మల మడుగు యువ ఉద్యోగులు లావనూరు సుమంత్, శ్రీహరి, మహేష్, జితేంద్ర. జమ్మలమడుగు పట్టణానికి చెందిన స్నేహితులు. వారికి పదేళ్ల వయసు నుంచి వీధిలో విగ్రహాలు పెట్టడం, చందాలతో గణనాధుడి ఉత్సవాలు నిర్వహిస్తూ వస్తున్నారు. బిటెక్ చదివారు. ఒకొక్కరు ఓ రకమైన ఉద్యోగం చేస్తున్నారు. ఈ ఏడాది వినూత్నంగా ఆలోచించి వారే వినాయకుడి విగ్రహాలు తయారు చేయించి, అమ్మేందుకు సిద్ధమై సఫలీకృతులయ్యారు. జమ్మల మడుగులో వినాయకుడి విగ్రహాలు ముద్దనూరు రోడ్డు, ప్రొద్దుటూరు రోడ్డు, కోవెలకుంట్ల రోడ్డులో తయారు చేస్తున్నారు. అందులో ముద్దనూరు రోడ్డులో తయారు చేసే ప్రదేశంలో యువ స్నేహితులు కలిసి రూపొందించిన విగ్రహాలు మిగతా వాటి కంటే భిన్నంగా ఉన్నాయి. బొమ్మల తయారీ, రంగులు అద్దడంలో ప్రత్యేకత ఉంది. గణనాధుని విగ్రహాలు 6 అడుగుల నుంచి 14 అడుగుల ఎత్తు ఉన్నా యి. రూ.7,000 నుంచి రూ.35,000 వేల వరకు వీరి వద్ద ఉన్నాయని, అం దులో పాండిచ్చేరి వారు ఒక విగ్రహాన్ని రూ.35 వేలకు తీసుకు వెళ్లారని చెబు తు న్నారు. ఇక్కడ 76 విగ్రహాలు, ప్రొద్దు టూరు రోడ్డులోని దుత్తలూరులో అనిమెల గురుశేఖర్ వారి నాన్న సుధాకర్ మొదటి నుంచి వినాయకుడి విగ్రహాలు చేస్తు న్నారు. గత ఏడాది 130 విగ్రహాలు చేస్తే ఈ ఏడాది 120 చేశారు. అక్కడ 4 అడు గుల నుంచి 16 అడుగుల వరకు ఎత్తు ఉన్నాయి. రూ.3 వేల నుంచి రూ.50 వేల వరకు ఉన్నాయి. తాడిపత్రి, కోవెలకుంట్ల రోడ్డులో మరో 70 వరకు విగ్రహాలు అమ్మ కానికి ఉంచారు. ఈ నెల 27న వినాయక చవితికి గణనాధులు ముస్తా బవుతున్నారు. తయారైన విగ్రహాలన్నీ కొనుగోలు చేస్తే కొంత ఆదాయం ఉం టుంది. విగ్రహాలు మిగిలితే నష్టం వస్తుందని తయారీదారులు చెబుతున్నారు.



రంగులు అద్దుతున్న కళాకారులు

విగ్రహంతో పాటు సందేశం ఇచ్చేలా..

ఈ ఏడాది గణనాధుడి విగ్రహాల తయారీదారులు కొత్తదనాన్ని చూపిస్తున్నారు. పుస్తకం చదివే వినాయకుడు, పార్వతి పరమేశ్వరుడి సన్నిధిలో కొలువైన బిడ్డగా, అభయమిచ్చేలా ఉన్న విగ్రహాలు ఆకట్టుకుంటున్నాయి.

అధికారులు నోటీసులు ఇస్తున్నారు..

పెద్ద విగ్రహాలన్నీ పిఒపితో అవుతున్నవే. ఈ విగ్రహాల తయారీ ప్రధాన కేంద్రం గుంతకల్లు. ప్రస్తుతం మునిసిపల్ అధికారులు పిఒపితో విగ్రహాలు పెట్టవద్దని నోటీసులు ఇచ్చి వెళ్లారు. గతంలో అట్టముక్కలు, పేపర్, చింతపిచ్చెలతో విగ్రహాలను తయారు చేసేవారం. ప్రస్తుతం పిఒపి విగ్రహాల కొనుగోలు ఎక్కువగా ఉంది. పాత పద్ధతికి గిరాకీ లేదని చేయడం లేదు.

- విగ్రహాల తయారీ వ్యాపారి.

డబ్బు కోసం కాకుండా పట్టుదలతో చేయించాం..



గణనాథుడి విగ్రహాలు డబ్బు కోసం కాకుండా ఇంకెన్నాళ్లు పక్కన కొనుగోలు చేసి విగ్రహం పెట్టాలి. మనమే ఎందుకు చేయ కూడదు అని భావించి పట్టుదలతో స్నేహితులం నలుగురం కలిసి విగ్రహాల తయారీకి నిర్ణయం తీసు కున్నాం. అందుకు తగ్గట్లు ఇతర ప్రదేశాల కంటే విగ్రహాలు కలర్, కొత్తదనంలోనూ భిన్నంగా ఉండాలని ఆలోచించాం. యువత తలచుకుంటే ఏమైనా చేయగరని చెప్పేందుకు ఇది ఒక నిదర్శనం.

- స్నేహితులు సుమంత్, శ్రీహరి

విగ్రహ ఏర్పాటులో జాగ్రత్తలు తీసుకోవాలి..



విగ్రహాల ఏర్పాటులో నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలి. విద్యుత్, మైక్ అనుమతి తీసుకోవాలి. విగ్రహ ఏర్పాటు, నిమజ్జనం ఎప్పుడు వివరాలను పోలీసులకు తెలపాలి. ఆ మేరకు ఏర్పాట్లు చేస్తాం. కుందూ, పెన్నా ప్రవహిస్తు న్నాయి. నిమజ్జనం రోజు చాలా అప్రమత్తంగా ఉండాలి.

- డిఎస్‌పి వెంకటేశ్వరరావు

స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్రకు కృషి చేయాలి

ప్రజాశక్తి - ముద్దనూరు

ప్రతి ఒక్కరూ పరిసరాల శుభ్రత పాటించి స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్రకు కృషి చేయాలని ఎంపిడిఒ పరిపూర్ణ అరుంధతి తెలిపారు. స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం అరుంధతి ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంపై ప్రజలకు అవగాహన సమావేశం నిర్వహించారు. పాత బస్టాండ్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించి మానవ హారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ వీరభద్రుడు, ఎపిఒ గంగయ్య, కార్యదర్శి లక్ష్మి నరసింహులు, వెలుగు, ఉపాధి, పంచాయతీ సిబ్బంది, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

సింహాద్రిపురం : ప్రతి ఒక్కరూ పరిసరాల శుభ్రత పాటించి స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్రకు కృషి చేయాలని ఇన్‌ఛార్జి ఇఒపిఆర్‌డి వెంకటరాముడు తెలి పారు. సింహాద్రిపురం జడ్పీ హైస్కూల్‌లో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. అనంతరం జడ్పీ హైస్కూల్ నుంచి బస్టాండ్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించి, మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సతీష్ కన్నబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బిజెపి చేతిలో జగన్ కీలుబొమ్మ

ప్రజాశక్తి - వేంపల్లె

ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో బిజెపి బలపరిచిన రాధాకృష్ణన్‌కు మద్దతు ఇవ్వాలని వైసిపి నిర్ణయించడంతో జగన్ నిజస్వరూపం బయటపడిందని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి వ్యాఖ్యానించారు. శనివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసిపి అధినేత జగన్‌రెడ్డి బిజెపి చేతిలో కీలుబొమ్మ అన్నారు. తన కేసుల కోసం, తన స్వార్థ ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రయోజనాలను జగన్‌రెడ్డి తాకట్టు పెడతాడని మరోసారి తేలిపోయిందని విమర్శించారు. జగన్ పార్టీకి ఓటు వేస్తే బిజెపికి ఓటు వేసినట్లే అని ప్రజలు గుర్తించాలని కోరారు. వైసిపి, టిడిపిది రాష్ట్రంలో కుస్తీ, ఢిల్లీలో దోస్తీ అన్నట్లుగా తయారైందని తులసిరెడ్డి ఎద్దేవా చేశారు.

'సురవరం' మృతి బాధాకరం

భారత కమ్యూనిస్టు పార్టీ అగ్రనేత, మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి మృతి బాధాకరమని తులసిరెడ్డి విచారం వ్యక్తం చేశారు. సురవరం నిరాడంబరతకు, నీతికి, నిజాయితీకి నిలువెత్తు నిదర్శనమన్నారు. ఆచరణాత్మక రాజకీయ దృక్పథం కలవాడని తులసిరెడ్డి కొనియాడారు. సుధాకర్‌రెడ్డి ఆత్మకు శాంతికలగాలని ఆకాంక్షించారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రజలు తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎమ్మెల్యే మాధవి పేర్కొన్నారు. శనివారం నగరంలోని 41, 42వ డివిజన్ రవీంద్ర నగర్ (కమల్ ఫ్యాన్సీ స్టోర్ వద్ద) ప్రారంభమైన 'వీధి శుభ్రత-ఆరోగ్య భద్రత' కార్యక్రమంలో టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, కడప జిల్లా అధ్యక్షులు ఆర్.శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే మాధవి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రజలతో మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణకు శుభ్రత ముఖ్యమన్నారు. ప్రతి వీధి పరిశుభ్రంగా ఉంచడంలో ప్రజలు కూడా భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. నగరపాలక సంస్థ కార్మికులు నిరంతర కృషిని గుర్తించి వారిని ప్రత్యేకంగా సన్మానించారు. కార్యక్రమంలో కార్పొరేటర్స్ చల్ల రాజశేఖర్, సూర్య నారాయణ, సుబ్బారెడ్డి, బాలకృష్ణారెడ్డి, పాల కొండ్రాయస్వామి టెంపుల్ చైర్మన్ రెడ్డయ్య, నాయకులు గౌస్, వెంకటేష్, మహేష్, మల్లికార్జున, బాలు, జనార్దన్, మహేంద్ర, ఆపిల్ గౌస్, రెడ్డి కుమార్, అబ్దుల్ రెహమాన్, పవన్‌కుమార్, కార్యకర్తలు మహిన్, సామిల్, సుహైల్, మహెబూబ్ హుస్సేన్, వెంకట్ పాల్గొన్నారు.

దోమల నియంత్రణ.. మనందరి బాధ్యత

ప్రజాశక్తి - సింహాద్రిపురం

దోమకాటుతో అనేక రోగాలు వస్తాయని, దోమల నివారణ మనందరి బాధ్యతని మలేరియా సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య పేర్కొన్నారు. మండలంలోని బిదినంచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గురిజాలలో శనివారం దోమకాటు వల్ల వచ్చు వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి సుకుమార్, పిహెచ్‌ఎన్ పద్మావతి, హెల్త్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవి, ఆరోగ్య కార్యకర్త రమాదేవి, సిహెచ్‌ఒ లీలా, ఆశా కార్యకర్త పద్మావతి, రాజారంగమ్మ పాల్గొన్నారు.

ఒకే పాఠశాలలో చదువుకున్న నలుగురికి పిఇటి ఉద్యోగాలు

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న నలుగురు డిఎస్‌సిలో పిఇటి ఉద్యోగాలకు అర్హత సాధించారని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామాంజనేయులురెడ్డి, ఉపాధ్యాయులు చంద్రఓబులరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వై.చంద్రకాంత్ 3వ ర్యాంక్, ఎస్.తాజుద్దీన్ 20వ ర్యాంక్, ఎస్.ఆరిఫ్ మహమ్మద్ 25వ ర్యాంక్, కె.జగదీశ్‌కుమార్ 46వ ర్యాంక్ సాధించారని హర్షం వ్యక్తం చేశారు. వీరు సెప్టెంబర్ 5న ఆయా పాఠశాలలో జాయిన్ అవుతారని పేర్కొన్నారు. పాఠశాల తరపున వారిని అభినందించారు.

ఘనంగా ఆంధ్ర కేసరి జయంతి ఉత్సవాలు

ప్రజాశక్తి - కడప

స్వాతంత్ర్య సమర యోధుడు టంగుటూరి ప్రకాశం పంతులు స్ఫూర్తి ప్రదాత అని, భవిష్యత్ తరాలకు ఆదర్శ ప్రాయులని నేషనల్ హైవే స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటపతి అన్నారు. కలెక్టరేట్‌లోని పిజిఆర్‌ఎస్ సమావేశం భవన్‌లో శనివారం ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 154వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటపతి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆంధ్రకేసరి జయంతిని ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. ఆంధ్ర రాష్ట్రానికి మొదటి ముఖ్యమంత్రిగా పని చేసిన టంగుటూరి నిరుపేద కుటుంబంలో పుట్టి, కష్టపడి చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకున్నారని తెలిపారు. తొలుత జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. మెప్మా పీడీ కిరణ్‌కుమార్, స్టెప్ సిఇఒ సాయిగ్రేస్, ఐసిడిఎస్ అధికారి రమాదేవి, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

వేంపల్లె : స్వాతంత్ర సమరయోధుడు, మాజీ ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు నీతి, నిజాయితీ, నిర్భీతి, నిరాడంబరత, ధైర్య సాహసాలకు మారుపేరని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. శనివారం వేంపల్లెలో ప్రకాశం పంతులు జయంతిని కాంగ్రెస్ నాయకులు, ఉషాకిరణ్ పాఠశాలలో ఉపాధ్యాయులు వేర్వేరుగా ఘనంగా నిర్వహించారు. పంతులు చిత్రపటానికి ఉషాకిరణ్ పాఠశాల కరస్పాండెంట్ బిఎస్ రమణారెడ్డి, తులసిరెడ్డి నివాళులర్పించారు. కార్యక్రమంలో పులివెందుల కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త ధ్రువకుమార్ రెడ్డి, వేంపల్లె, చక్రాయపేట, మండల శాఖ అధ్యక్షులు రామకృష్ణ, రామాంజనేయరెడ్డి, అమర్నాథ్‌రెడ్డి, ఉత్తన్న, భద్రి, రాఘవయ్య, వేమారాజ, సాయి పాల్గొన్నారు.

పులివెందుల రూరల్ : పులివెందుల ఆహార విజ్ఞాన శాస్త్ర, సాంకేతిక కళా శాలలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని ఫుడ్అండ్‌సైన్స్ కళా శాలలో నిర్వహించారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.మాధవ, అధ్యాపకులు, విద్యార్థులు ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులర్పించారు. ప్రకాశం పంతులు జీవిత చరిత్ర గురించి విద్యార్థులు మాట్లాడారు. అధ్యాపకులు డాక్టర్ రాజేష్, ఇంజినీర్ శ్రీకాంత్, డాక్టర్ సాయి శ్రీనివాస్, డాక్టర్ జాకీర్ బాషా, డాక్టర్ ప్రదీప్‌కుమార్, కుమారి మాధవి, కె.సుబ్బారెడ్డి, ఎన్.వి.సుబ్బారెడ్డి, పీడీ డాక్టర్ రాజశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

అధిక ధరలకు ఎరువులు అమ్మరాదు

ప్రజాశక్తి - మైదుకూరు రూరల్

రైతుల నుంచి అధిక లాభాలు పొందేందుకు అనధికారికంగా ఎరువులు అమ్ముతున్న రెండు దుకాణాలపై కడప విజిలెన్స్, వ్యవసాయ అధికారులు శనివారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. కలెక్టర్, కడప రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ శ్రీనివాసరావు, అడిషనల్ ఎస్పీ, కడప జిల్లా సంయుక్త వ్యవసాయ సంచాలకులు ఎం.చంద్రనాయక్ ఆదేశాల మేరకు దాడులు నిర్వహించారు. ఇందులో భాగంగా మైదుకూరులోని శ్రీలక్ష్మీ వెంకటేశ్వర ఫర్టిలైజర్స్, శ్రీసాయి లక్ష్మి ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ షాపులను తనిఖీ చేశారు. తనిఖీలో స్టాక్ రికార్డుల్లో స్వల్ప వ్యత్యాసాలు ఉన్నట్లు గుర్తించారు. ఆ రెండు దుకాణాల అమ్మకాలను నిలిపివేయాలని నోటీసులు జారీ చేశారు. కార్యక్రమంలో మైదుకూరు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.కృష్ణమూర్తి, విజిలెన్స్ సీఐ ఎం.శివన్న, స్థానిక సీఐ రమణారెడ్డి, ఎఒ బాలగంగాధర్ రెడ్డి పాల్గొన్నారు. **దువ్వూరు :** మండల కేంద్రమైన దువ్వూరులో ఎరువులు దుకాణాలను తహశీల్దార్ సంజీవరెడ్డి తనిఖీ చేశారు. కలెక్టర్, జమ్మలమడుగు ఆర్‌డిఒ ఆదేశాల మేరకు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశామన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ జాన్సన్ పాల్గొన్నారు. **చాపాడు :** ఎరువులను రైతులకు ఎంఆర్‌పి ధరలకు అమ్మాలని డిప్యూటీ తహశీల్దార్ కృష్ణారెడ్డి తెలిపారు. శనివారం ఆయన మండలంలోని ఎరువుల, పురుగుమందుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. ఎంఆర్‌పి ధరలు, స్టాకు వివరాలను సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. యూరియా కృత్రిమ కొరత చూపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు అడిగిన ఎరువులను మాత్రమే ఇవ్వాలని, వారికి ఇష్టం లేని వాటిని బలవంతంగా ఇవ్వకూడదన్నారు.

వైభవం.. అంజన్న గ్రామోత్సవం

ప్రజాశక్తి - చక్రాయపేట

గండి క్షేత్రంలో ఆంజనేయస్వామి గ్రామోత్సవం శనివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. శ్రావణ మాసోత్సవాలు చివరి శనివారం కావడంతో ప్రతి ఏడాది ప్రకారం ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహాన్ని ప్రధాన అర్చకులు కేసరి స్వామి, ఉప ప్రధాన అర్చకులు రాజా స్వాములు భక్తులు అలరించేలా అలంకరించారు. దేవస్థాన చైర్మన్ కావలి కృష్ణతేజ. దేవస్థాన అసిస్టెంట్ కమిషనర్ జె వెంకటసుబ్బయ్య పర్యవేక్షణలో ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. మాజీ గండి దేవస్థాన చైర్మన్ వెంకటస్వామి సేవ కమిటీ సభ్యులు ట్రిపుల్‌ఐటి విద్యార్థులు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతి శనివారం భక్తులకు అన్నదానం దిగ్విజయంగా దాతలు చేపట్టారు

అంజన్న సేవలో 'నారాయణ' ఉపాధ్యాయులు

వేంపల్లె : గండి శ్రీవీరాంజనేయ స్వామి సేవలో వేంపల్లెకు చెందిన నారాయణ పాఠశాల ఉపాధ్యాయులు పాలు పంచుకున్నారు. శనివారం గండి క్షేత్రంలో జరిగిన చివరి శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగా ఆయా సేవా కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు భక్తులకు సహాయపడ్డారు. వీరన్నగట్టుపల్లి క్రాస్ వద్ద నుండి గండి క్షేత్రం వరకు బస్సు సౌకర్యం ఏర్పాటు చేశారు. ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటి ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ విద్యార్థులు క్యూలైన్లలో శ్రద్ధగా మార్గనిర్దేశం చేశారు. క్యూలైన్‌లో ఉన్న భక్తులకు తాగునీరు అందించారు. గండి క్షేత్రంలో ఎన్ ఎస్‌ఎస్ విద్యార్థుల పాత్ర ప్రశంసనీయంగా మారింది. దాతలు రోడ్డు వెంబడి అన్నదానాలు, పండ్లు పంపిణీ కార్యక్రమాలు చేపట్టారు. చివరి వారం అమావాస్యం కావడంతో ఉదయం కొద్దిగా భక్తుల రద్దీ తక్కువ అయినప్పటికీ మధ్యాహ్నం నుండి భక్తుల రద్దీ బాగా పెరిగింది. రాయచోటి రోడ్డు భక్తులతో కిటకిటాడింది.

అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నూతన పట్టణ కమిటీ ఎన్నిక

జమ్మలమడుగు రూరల్ : జమ్మలమడుగులో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మహాసభను ఐసిడిఎస్ కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారని సంఘం జిల్లా అధ్యక్షులు లక్ష్మీదేవి తెలిపారు. నూతన పట్టణ ప్రాజెక్టు అధ్యక్షురాలుగా లక్ష్మీదేవి, కార్యదర్శిగా భాగ్యమ్మ, కోశాధికారిగా కులాయమ్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన పట్టణ కమిటీ సభ్యులు మేరీ, చంద్రిక, సుబ్బమ్మ, జమాల్ బి, హైమావతి, లక్ష్మీకళ, అమ్ములు, మరియమ్మ, లక్ష్మీదేవి, సువర్ణ, మహాలక్ష్మి, లక్ష్మీదేవిని ఎన్నుకున్నారు. సిఐటియు గౌరవ అధ్యక్షుడు ఏసుదాసు, పట్టణ కార్యదర్శి దాసరి విజయ్, ఉపాధ్యక్షుడు ఏ వినయ్‌కుమార్, అంగన్వాడీ వర్కర్స్ యూని యన్ నాయకులు పాల్గొన్నారు.

ఆహార నాణ్యత లోపిస్తే చర్యలు

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : అన్న క్యాంటీన్‌లో ఆహార నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవు టిడిపి రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి హెచ్చరించారు. శనివారం స్థానిక పట్టణంలోని టిబి కాంప్లెక్స్ పక్కన ఉన్న అన్న క్యాంటీన్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించారు. సౌకర్యాలు ఎలా ఉన్నాయి.. భోజనం బాగా పెడుతున్నారా, ఆహార నాణ్యతలో లోపం ఏమన్నా ఉందా అని అక్కడ భోజనం చేసే పేదలతో ఆరా తీశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ కొండయ్య, 5వవార్డు కౌన్సిలర్ వంగనూరు మురళీధర్‌రెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ మారుతి ప్రసాద్‌రెడ్డి, రాష్ట్ర వికలాంగుల మాజీ డైరెక్టర్ సిద్దయ్య, నాయకులు నంద్యాల హరినాథ్ రెడ్డి, రామాంజనేయులురెడ్డి, బూతురు వెంకట్రా మిరెడ్డి, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

మంచి ఆలోచనలు ఉన్నత భవిష్యత్తును ఇస్తాయి : ఎమ్మెల్సీ

జమ్మలమడుగు రూరల్ : మంచి ఆలోచనలు మంచి జీవితాన్ని ఇస్తాయని ఎమ్మెల్సీ పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి తెలిపారు. సాయి శివాని ఫంక్షన్ హాల్‌లో శ్రీ షిర్డీసాయి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ ఎన్.హైమావతి, ప్రిన్సిపల్ క్రరు సంజీవరెడ్డి అధ్యక్షతన ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ పాల్గొన్నారు. శ్రీషిర్డీసాయి డిగ్రీ కళాశాల ప్రిన్సి పల్ సుధ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. అధ్యాపకులు పాల్గొన్నారు.



బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్

దువ్వూరు-ప్రొద్దుటూరు ఆర్‌టిసి సర్వీసు ప్రారంభం

ప్రజాశక్తి - దువ్వూరు

దువ్వూరు నుంచి ప్రొద్దుటూరు వెళ్లేందుకు ఆర్‌టిసి బస్సును ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ప్రారంభించారు. దువ్వూరు నుంచి ప్రొద్దుటూరుకు బస్సు సౌకర్యం లేదని టిడిపి పట్టణ ఇన్‌ఛార్జి రాంబాబు సూచన మేరకు శనివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించిందన్నారు. దువ్వూరు నుంచి ప్రొద్దుటూరుకు బస్సు లేదని తెలిసిన వెంటనే అధికారులతో మాట్లాడి ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు ఆర్‌టిసి డిపో మేనేజర్, టిడిపి మండల ఇన్‌ఛార్జి బొర్రెడ్డి రమణారెడ్డి, దువ్వూరు టౌన్ ఇన్‌ఛార్జి పాపిరెడ్డి రాంబాబు, కేసీ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ చైర్మన్ కోనేటి హరినాథ్, నల్లబిమ్మ వెంకటేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.



పాల్గొన్న ఉత్సవ కమిటీలు (ఇన్‌సెట్) మాట్లాడుతున్న డిఎస్‌పి రాజేంద్రప్రసాద్

వినాయక చవితిని శాంతియుతంగా జరుపుకోవాలి

ప్రజాశక్తి - మైదుకూరు రూరల్

వినాయకచవితి పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని మైదుకూరు డిఎస్‌పి రాజేంద్రప్రసాద్ సూచించారు. వినాయక ఉత్సవ కమిటీలతో శనివారం స్థానిక డిఎస్‌పి కార్యాలయంలో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ.. గణేష్ ఉత్సవాలను కులమతాలకు అతీతంగా, సామరస్యపూర్వక వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. విగ్రహాల ఏర్పాటుకు ఎలాంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. విగ్రహాల వద్ద, శోభాయాత్రలో డీజేలకు అనుమతి లేదన్నారు. అల్లర్లు, ఆకతాయి చేష్టలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వినాయక విగ్రహాల ఏర్పాటుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం పోలీసులు స్థలాన్ని పరిశీలించి, కమిటీతో మాట్లాడి అనుమతి ఇస్తారని తెలిపారు. విగ్రహాల ఏర్పాటు, నిమజ్జనం సమయంలో విద్యుత్ ప్రమాదాలు జరగకుండా కమిటీ సభ్యులు జాగ్రత్త వహించాలని సూచించారు. పండుగ మొదలుకొని నిమజ్జనం పూర్తయ్యే వరకు విధిగా ఉత్సవ కమిటీదే పూర్తి బాధ్యత అని డిఎస్‌పి పేర్కొన్నారు. సమావేశంలో సిఐ రమణారెడ్డి, ఎస్‌ఐ చిరంజీవి పాల్గొన్నారు.

చాపాడు (మైదుకూరు) : పర్యావరణ పరి రక్షణ మన అందరి బాధ్యత అని మైదుకూరు రూరల్ సిఐ శివశంకర్ తెలిపారు. శనివారం డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్టిద్దాం పర్యావరణాన్ని కాపాడుదాం అనే పోస్టర్లను మైదుకూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ పర్యావరణ కాలుష్యం కావడం ద్వారా అనేక వాతావరణ మార్పులు చెంది ప్రజలు ఇబ్బందులకు గురి అవుతున్నారన్నారు. వినాయక చవితి పండుగను ప్రజలు సంతోషంగా జరుపుకోవాలన్నారు. అందులో ప్రధానంగా ప్రతి ఇంటా మట్టి గణపతిని ప్రతిష్టించి పర్యావరణ పరిరక్షణకు నాంది పలకాలన్నారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్న డివైఎఫ్ఐకి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డివైఎఫ్‌వై జిల్లా ఉపాధ్యక్షులు రెబ్బా నరసింహులు, దినేష్, రామాంజనేయులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకులో ఘరానా మోసం

ఖాజీపేట : పత్తూరు దళితవాడ సమీపంలో ఓ ప్రయివేట్ కంపెనీకి చెందిన పెట్రోల్ బంకులో ఘరానా మోసం శనివారం చోటు చేసుకుంది. ఓ ద్విచక్ర వాహనదారుడు రూ.వంద పెట్రోల్‌కు వెళ్లగా, పరిమాణం తక్కువగా ఉండడం గమనించి సిబ్బందిని ప్రశ్నించాడు. పట్టిన పెట్రోల్‌ను మళ్లీ కొలవాలంటూ డిమాండ్ చేశాడు. దీంతో అక్కడ సిబ్బంది లీటర్ బాటిల్‌తో కొలవగా పరిమాణం తక్కువగా వచ్చింది. రూ.30 పెట్రోల్ మాత్రమే వచ్చిందని వాహనదారుడు ప్రశ్నించాడు. ఖాజీపేటలో పెట్రోల్ బంక్ యజ మానులు ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారని, ఇంధన శాఖ, రెవెన్యూ శాఖ అధి కారులు పట్టించుకోవడంలేదని వాహనదారులు పాపోతున్నారు. అక్రమాలకు పాల్పడుతున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. పెట్రోల్ బంకులలో కనీసం తాగునీరు, మరుగుదొడ్లు కూడా అందుబాటులో లేవని పలువురు పేర్కొంటున్నారు.

13న జాతీయ లోక్ అదాలత్

జమ్మలమడుగు రూరల్ : సెప్టెంబర్ 13న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జమ్మలమడుగు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి భార్గవి పిలుపునిచ్చారు. స్థానిక కోర్టులో శనివారం కోర్టు పరిధిలోని పోలీస్ డిపార్ట్మెంట్, బార్ కౌన్సిల్‌తో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ లక్ష్మయ్య, డిఎస్పీ వెంకటేశ్వరరావు, సిఐలు, ఎస్ఐలు, కోర్టు కానిస్టేబుళ్లు, బార్ కౌన్సిల్ అధ్యక్ష, కార్యదర్శులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

లింగాల : పలు గ్రామాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆ శాఖ అధికారి రమేష్ బాబు శనివారం ఒక ప్రక టనలో తెలిపారు. ఆర్డీ ఎస్ఎస్ వర్క్ కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వెలిదండ్ల స్టేషన్ నుండి 11 కెవి కర్నపాపయ్యపల్లె ఫీడర్ విద్యుత్ సరఫరాలో అంత రాయం ఏర్పడుతుందన్నారు. సహకరించాలన్నారు.